వణికిస్తున్న విష జ్వరాలు



గాజువాక వాసులను విష జ్వరాలు వణికిస్తున్నాయి. ప్రతి ఇంట్లో ఒకరిద్దరు మంచాన పడ్డారు. జ్వర పీడితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చాలా మంది ప్రైవేట్ ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. వారి సంఖ్య లెక్కల్లోకి రానప్పటికీ ప్రభుత్వ ఆస్పత్రులు సైతం రోగులతో కిటకిటలాడుతున్నాయి.



జ్వరంతో బల్లపై పడుకున్న బాలుడు

- కిటకిటలాడుతున్న ఆస్పత్రులు
- నాలుగు నెలల్లో 1546 జ్వరం కేసుల నమోదు
- 50 డెంగ్యూ కేసుల నమోదు
- ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లే వారి సంఖ్య రెట్టింపు

గాజువాక: జ్వరం, తలనొప్పి, గొంతునొప్పి తదితర ఇబ్బందులతో రోగులు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. గాజువాక, కణితి, పెదగంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతోపాటు అర్బన్ పీహెచ్‌సీల్లో కూడా వైద్యం కోసం రోగులు క్యూ కడుతున్నారు. ప్రస్తుత సీజన్‌లో ఆరోగ్య కేంద్రాలకు వస్తున్నవారిలో సగం మంది జ్వర పీడితులు ఉంటున్నారని ఆయా ఆస్పత్రివర్గాలు పేర్కొంటున్నాయి. ఒక్క గాజువాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే రోజుకు సగటున 20 మంది జ్వరపీడితులు నమోదవుతున్నారు. మిగిలిన పీహెచ్‌సీల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది.

డెంగ్యూ లక్షణాలతో ఆందోళన

ఇటీవల కాలంలో జ్వర బాధితుల్లో డెంగ్యూ లక్షణాలు ఎక్కువ మందిలో కనిపిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. గాజువాక పీహెచ్‌సీలో నెలకు సుమారు 130 మంది వరకు రక్త నమూనాలు సేకరించి పరీక్షలు జరిపినట్టు వైద్యాధికారులు తెలిపారు. ప్రైవేట్ ఆస్పత్రుల సిబ్బంది నిర్ధారిస్తున్న నివేదికలనే ప్రభుత్వ ఆస్పత్రుల సిబ్బంది పరిగణిస్తే ఈ సంఖ్య వందల్లోకి పెరిగిపోయే అవకాశం ఉంది. జ్వరం బారిన పడి ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న రోగులకు రక్త పరీక్షల్లో ప్లేట్‌లెట్ల సంఖ్య గణనీయంగా పడిపోతుండడంతో వైద్యులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తీవ్రమైన జ్వరం, భరించలేని తలనొప్పి, కళ్లు ఎర్రబడటం, వాంతులు చేసుకోవడం వంటి లక్షణాలతో ఎక్కువ మంది ఆస్పత్రులపాలవుతున్నారు. గాజువాక పీహెచ్‌సీలో గడిచిన నాలుగు నెలల్లో 1546 జ్వరం కేసులు నమోదైనట్టు వైద్యాధికారులు తెలిపారు.



ఓపీ రిజిస్ట్రేషన్

గాజువాక పీహెచ్‌సీలో నాలుగు నెలల్లో నమోదైన జ్వరాల కేసులు

నెల	నమోదైన కేసులు
మే	372
జూన్	399
జులై	360
ఆగస్టు	415

మలేరియా, డెంగ్యూ కేసులూ ఎక్కువే

జ్వర పీడితుల్లో మలేరియా బాధితులు కూడా ఎక్కువ సంఖ్యలోనే నమోదవుతున్నారు. గాజువాక ప్రాంతంలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 40,502 మంది నుంచి రక్త నమూనాలు సేకరించారు. అందులో 43 మలేరియా కేసులు, 50 డెంగ్యూ కేసులు వెలుగు చూసినట్టు యాంటీ మలేరియా విభాగం అధికారులు తెలిపారు. గాజువాక, వడ్లపూడి, పెదగంట్యాడ సబ్ యూనిట్ల పరిధిలో ప్రతినెల వేలాదిమంది మంచాన పడుతున్నారు. ఈ ఏడాది మేలో 6038 మంది నమోదు కాగా వారిలో ముగ్గురు మలేరియాకు గురయ్యారు. జూన్‌లో 6478 మంది నుంచి నమూనాలు సేకరించగా, 14 మంది, జులైలో 6027 మంది నుంచి రక్త నమూనాలు సేకరించగా 10 మంది, ఈ నెలలో ఇప్పటివరకు 1020 మంది జ్వరపీడితుల నుంచి నమూనాలను సేకరించగా నలుగురికి మలేరియా సోకినట్టు నిర్ధారించారు.



గాజువాక పీహెచ్‌సీలో రోగుల క్యూ

మందులతో సరి



మందులు ఇస్తున్న ఉద్యోగి

ఇక్కడి ప్రభుత్వాస్పత్రుల్లో ఔట్‌పేషెంట్ (ఓపీ) సౌకర్యమే ఉంది. ఇన్‌పేషెంట్ సౌకర్యం లేకపోవడంతో సిబ్బంది ప్రాథమిక వైద్యంతో సరిపెట్టి మందులిచ్చి పంపించేస్తున్నారు. ఆర్థికంగా తట్టుకోగలిగినవారు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. జ్వరంతోపాటు కీళ్ల నొప్పులు, కాళ్లు, చేతులు పీకేయడం వంటి లక్షణాలు ఉంటున్నాయని రోగులు పేర్కొంటున్నారు.

అప్రమత్తంగా ఉండాలి



ప్రస్తుత వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. జ్వరం లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ఆస్పత్రులను సంప్రదించాలి. నీరు ఎక్కువ రోజులు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించడం ద్వారా దోమలను కట్టడి చేయవచ్చు. ఇంటి పరిసరాల్లో కొబ్బరి చిప్పలు, పాత టైర్లు, కుండ పెంకులు వంటి లేకుండా చూసుకోవాలి. రోగులతో పాటు అందరూ కాచి చల్లార్చిన నీరు తాగడంతోపాటు చిన్నపాటి జాగ్రత్తలు తీసుకోవాలి. వర్షంలో తడవడం వంటివి చేయకూడదు. దీనివల్ల రోగాలకు దూరంగా ఉండవచ్చు.

– డాక్టర్ ఎం.సుధాకర్, గాజువాక పీహెచ్‌సీ వైద్యాధికారి

దోమల నివారణ మందు పిచికారీ



అక్కిరెడ్డిపాలెం శ్మశానవాటిక వద్ద డ్రోన్‌తో దోమల మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

అక్కిరెడ్డిపాలెం: భారీ డ్రైన్లు, చెరువులు, నీటి నిల్వ ఉన్న స్థలాల్లో దోమల లార్వాలను నివారించడానికి మలేరియా లార్విసైడ్ (యంఎల్) ఆయిల్ డ్రోన్ల ద్వారా పిచికారీ చేస్తున్నారు. అక్కిరెడ్డిపాలెం, మిందిప్రాంతాల్లోని భారీ డ్రైన్లు, చెరువులు, నీటి కుంటల్లో శుక్రవారం డోన్ సాయంతో స్ప్రే చేశారు. వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష మాట్లాడుతూ దోమల ద్వారా వ్యాప్తి చెందే ప్రాణాంతక వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వంటి వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గుడివాడ లతీష్, సంగ్రాన నూకరాజు, వరదాడ వెంకటరమణ, సీపీఎం నాయకుడు లోకేష్, సూపర్‌వైజర్ అప్పలరాజు పాల్గొన్నారు.

విశ్వేశ్వరయ్యనగర్ రోడ్డులో స్టాపర్ల తొలగింపు



క్రేన్‌తో స్టాపర్లను తొలగిస్తున్న బి.వి.రామ్ తదితరులు

గాజువాక: స్థానిక విశ్వేశ్వరయ్యనగర్ వాసులు రాకపోకలు సాగిస్తున్న సర్వీస్ రోడ్డుకు అడ్డంగా గాజువాక ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేసిన సిమెంట్ స్టాపర్లను తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ నేతృత్వంలో శుక్రవారం తొలగించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ పేరుతో ట్రాఫిక్ పోలీసులు ఈ రోడ్డును రెండు నెలల కిందట మూసివేసిన విషయం తెలిసిందే. దీనిపై కాలనీవాసులు అటు పోలీసులకు, ఇటు ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాలు అందజేసి మొర వినిపించినప్పటికీ స్పందించలేదు. ఈ నేపథ్యంలో తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ ఒక క్రేన్‌ను ఏర్పాటు చేసి స్టాపర్లను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వీస్ రోడ్డును మూసివేయడం వల్ల కాలనీ వాసులు మూడు కిలోమీటర్ల మేర తిరిగి రాకపోకలు సాగించేవారన్నారు. అందుకే తాను వాటిని తొలగించానని పేర్కొన్నారు. కాగా, ఆయనకు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి, స్థానిక నాయకులు బి.వి.రవికుమార్, వి.శ్రీనివాసరావు, పి.అప్పలరెడ్డి, కాశీబాబు, కె.శ్రీకాంత్, ఈటి రవికుమార్, కె.అమర్‌నాథ్ తదితరులు మద్దతు తెలిపారు.

క్లుప్తంగా

కణితి హైస్కూల్ హెచ్‌ఎంకు అభినందన



కలెక్టర్ హరేంధిర ప్రసాద్ నుంచి పురస్కారం అందుకుంటున్న హెచ్‌ఎం ప్రకాశరావు

అగనంపూడి: జిల్లా స్థాయి ఉత్తమ క్రీడా ప్రతిభా పురస్కారం అందుకున్న కణితి హైస్కూల్ హెచ్‌ఎం ప్రకాశరావును పలువురు అభినందించారు. ఆంధ్రా యూనివర్సిటీ న్యూ సెమినార్ హాల్లో గురువారం నిర్వహించిన జాతీయ క్రీడా దినోత్సవ కార్యక్రమంలో క్రీడా ప్రతిభా పురస్కారాన్ని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అందజేశారు. ఈ సందర్భంగా శుక్రవారం హెచ్‌ఎంతో పాటు ఫిజికల్ డైరెక్టర్లు ఎం.మన్నాజీ, పి.నారాయణరావును మిగిలిన ఉపాధ్యాయులు సత్కరించారు.

ఆ స్థలం హౌస్ బిల్డింగ్ సొసైటీదే

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని పాత పంప్ హౌస్ స్థలం కబ్జా జరిగిందని కొందరు స్వార్థపరులు తప్పు దోవ పట్టించి వార్తా కథనాలు రాయించారని బీహెచ్‌పీవీ హౌస్ బిల్డింగ్ సొసైటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం బీహెచ్‌పీవీ - హెచ్‌బీఎస్ సభ్యులు మాట్లాడుతూ సొసైటీకు చెందిన స్థలం కొనుక్కున్న వ్యక్తి ఆ స్థలంలో గేటు ఏర్పాటు చేస్తే ఆక్రమించాడని తప్పుడు ప్రచారం చేశారని చెప్పారు. కొనుగోలుదారుడు కొన్న స్థలం విలువలో 37 శాతం రుసుం షీలానగర్ అప్ కీప్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు అందజేశారన్నారు. ఈ అంశాన్ని పూర్తి ఆధారాలతో జీవీఎంసీ కమిషనర్, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు.

కోలాట బృందానికి చీరల అందజేత

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు దిబ్బపాలెంలోని శ్రీగాయత్రీ దేవి కోలాట బృందానికి ఫార్మాసిటీ నిర్వాసిత కాలనీకి చెందిన నాయకుడు కర్రి దోశేంద్ర రూ.25వేల విలువైన చీరలు, స్టిక్కులు అందించారు. దిబ్బపాలెంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో కోలాటం గురువు పచ్చికోరు చిన్నారావు చేతుల మీదుగా 40 మంది బృందానికి వీటిని అందించారు. కార్యక్రమంలో దిబ్బపాలెం అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు యలమంచిలి అప్పారావు, మాడిశ వెంకటరావు, శీరంశెట్టి బాబ్జి, ఈగల పోలినాయుడు, ఉరివిటి రాజు, గొల్లవిల్లి రామారావు పాల్గొన్నారు.


వినాయక ఉత్సవాలకు శ్రీకారం



పందిరి రాట వేస్తున్న గాంధీనగర్ అధ్యక్షుడు కాతా బాలకృష్ణ తదితరులు

పెదగంట్యాడ: గణపతి ఉత్సవాలను జీవీఎంసీ 76వ పరిధి గాంధీనగర్‌లో ఘనంగా నిర్వహించనున్నామని కాలనీ అధ్యక్షుడు కాతా బాలకృష్ణ తెలిపారు. స్వామివారి ఉత్సవ రాటను శుక్రవారం వేశారు. కార్యక్రమంలో కాలనీ పెద్దలు చెల్లి రిషికేష్, గాలి అన్వేష్‌కుమార్, భీమిరెడ్డి శ్రీనివాస్, ఎల్‌బీసీ శ్రీనివాస్, గోవింద్, సిమ్మిటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రావణ మాస పూజలు



ఉక్కు త్రిశక్తి ఆలయంలో కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

ఉక్కునగరం: శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా స్థానిక త్రిశక్తి దేవాలయంలో అమ్మవార్లకు సామూహిక కుంకుమార్చన చేశారు. అంతకు ముందు శ్రీమహాలక్ష్మి, శ్రీమహాదుర్గ, శ్రీమహాసరస్వతి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు ఫణిశర్మ నేతృత్వంలో సాయంత్రం శ్రీమహాలక్ష్మి అమ్మవార్లకు సహస్ర శ్వేత పుష్పార్చన చేశారు. కలశాభిషేకం నిర్వహించారు. ఉక్కునగరం, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు.

బకాయిలు చెల్లించకుంటే విధులు బహిష్కరిస్తాం



ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భారతికి వినతిపత్రం అందిస్తున్న ఒప్పంద కార్మికులు

అగనంపూడి: అగనంపూడి ఏరియా ఆస్పత్రిలోని వివిధ విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల బకాయి జీతాలు చెల్లించాలని, కనీస వేతనాల చట్టం ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భారతికి వినతి పత్రం అందజేశారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ మరియు వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ్ మాట్లాడుతూ ఆస్పత్రిలో పారిశుధ్యం, భద్రతా విభాగం, చెదపురుగుల నివారణ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు సత్వరం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో వచ్చేనెల 1 నుంచి నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నామని, అప్పటికీ స్పందించకుంటే 15వ తేదీ నుంచి విధులు బహిష్కరిస్తామన్నారు. నాలుగు నెలల బకాయిలు చెల్లించడంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్‌ను ఆయా ఖాతాలకు జమ చేయాలన్నారు. కార్యక్రమంలో మంగ, చిన్న, పద్మ, కిరణ్‌కుమార్, శ్రావణి, సరోజిని, సంధ్య, రామయ్య, వరలక్ష్మి, కాంతం, ఝాన్సీ, మాతాజీ, లీలా, సావిత్రి, సూరిబాబు, పైడమ్మ, లక్ష్మి, ఈశ్వరరావు, సూరిబాబు పాల్గొన్నారు.

సామాజిక భవనం ఏర్పాటుకు కృషి

అగనంపూడి: విశ్రాంత ఉద్యోగుల సామాజిక భవనం కోసం తనవంతు కృషి చేస్తానని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు అన్నారు. అగనంపూడి ప్రాంతంలోని విశ్రాంత ఉద్యోగులు, సీనియర్ సిటిజన్ల సమావేశం శుక్రవారం దానబోయిపాలెం ఆలయ ఆవరణలో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులు ఐకమత్యంతో మెలుగుతుండడంతో సంతోషంగా ఉందన్నారు. విశ్రాంత ఉద్యోగులు, సీనియర్ సిటిజన్స్ కోరిక మేరకు భవనం ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు జి.బోసుబాబు, నాయకులు షేక్ మహమ్మద్ రఫీ, బి.భాస్కరరాజు, కరణం సత్యారావు, బత్తుల కాళిదాసు, ఎం.రామచంద్రరావు, విందుల వరహాలు, పోలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విశ్రాంత ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

వదలని వాన

- లోతట్టు ప్రాంతాలు జలమయం

పెదగంట్యాడ: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జన జీవనం అస్తవ్యస్తమైంది. ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో జనం అవస్థలు పడుతున్నారు. శుక్రవారం మధ్యాహ్నం పెద్ద ఎత్తున వాన పడడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గెడ్డలు, కాలువలు పొంగిపొర్లాయి. రోడ్లన్నీ చెరువుల్లా మారాయి. ఎక్కడికక్కడ వర్షపు నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. బర్మా కాలనీ, డెయిరీ కాలనీ, రామచంద్రనగర్, వుడా కాలనీ, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో వర్షపునీరు రోడ్లపై నిలిచిపోవడంతో చెరువులను తలపించాయి.



నడుపూరు పైడమాంబ ఆలయం ఎదుట నిలిచిన వర్షపు నీరు

నీరుకొండ సేవలు స్టీల్‌ప్లాంట్‌కు అవసరం

ఉక్కునగరం: స్టీల్ ఐఎన్‌టీయూసీ అధ్యక్షులు నీరుకొండ రామచంద్రరావు సేవలు స్టీల్‌ప్లాంట్‌కు ఎంతో అవసరమని యుటిలిటీస్ విభాగాధిపతి ఎస్.ఆర్. రవి కొనియాడారు. నీరుకొండ శనివారం పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా శుక్రవారం యుటిలిటీస్ విభాగంలో ఆయన్ను విభాగం ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు సత్కరించారు. స్టీల్ ఐఎన్‌టీయూసీ ప్రధానకార్యదర్శి మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ జీవితం అంతా కార్మికుల సంక్షేమం కోసం అంకితం చేశారన్ని కొనియాడారు. ఏఐటీయూసీ అధ్యక్షుడు కె.ఎస్.ఎన్. రావు ,జీఎంలు శ్యాంబాబు, దేవదాసు పాల్గొన్నారు.



నీరుకొండ రామచంద్రరావును సత్కరిస్తున్న ఉన్నతాధికారులు, కార్మిక నాయకులు

స్టీల్ ప్లాంట్ కార్మికుల ధర్నా

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని స్టీల్ సీఐటీయూ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. సమస్యలపై శుక్రవారం సాయంత్రం ఈడీ (వర్క్స్) బిల్డింగ్ వద్ద ధర్నా చేశారు. నాయకులు మాట్లాడుతూ బయోమెట్రిక్ పద్ధద్దతిలో అనేక సమస్యలు ఉన్నాయన్నారు. పాత పద్ధతిలో కార్మికులకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు 26 రోజులు పని కల్పించాలన్నారు. అనంతరం సీజీఎం (వర్క్స్) యు. శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.ఎం. శ్రీనివాసరావు, జి. శ్రీనివాసరావు, ఓ.వి. రావు, నమ్మి రమణ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ, ఎయిడ్స్ పై అవగాహన

పెదగంట్యాడ: హెచ్‌ఐవీ, ఎయిడ్స్ రాకుండా జాగ్రత్తలు పాటించాలని యాక్సెప్ట్ మైదేంట్ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ అనిల్‌కుమార్ అన్నారు. పెదగంట్యాడ ప్రభుత్వ న్యూ ఐటీఐలో శుక్రవారం హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

పరిశుభ్రతతో వ్యాధులకు చెక్

ఫ్రైడే- డ్రైడే పై అవగాహన ర్యాలీలు



86వ వార్డు పెదయాతపాలెంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ కోటేశ్వరరావు

పెదగంట్యాడ/అగనంపూడి/అక్కిరెడ్డిపాలెం: వారంలో ఒక రోజు.. ప్రతి శుక్రవారం ప్రతి ఒక్కరూ విధిగా డ్రై డే పాటించాలని శానిటరీ, మలేరియా విభాగం అధికారులు శుక్రవారం విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇళ్లలో రోజుల తరబడి మంచినీరు నిల్వ ఉంచవద్దని సూచించారు. జీవీఎంసీ 77వ వార్డు దేవాడలో నిర్వహించిన కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ కె అప్పలరాజు, దేవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ ప్రసాద్‌రాజా, ఆరోగ్య సిబ్బంది శ్రీనివాసరావు, గోపాలం, శ్రీనుబాబు, దేవి, పర్విన్ బేగం పాల్గొన్నారు.

- 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం, 69వ వార్డు నాతయ్యపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో మలేరియా ఇన్‌స్పెక్టర్ డి.శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎస్.శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ 68వ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్, హెల్త్ అసిస్టెంట్ కె.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.
- జీవీఎంసీ 86వ వార్డు పెదయాతపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ లేళ్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ డెంగ్యూ, మలేరియా వంటి జ్వర కారకాలు నీటి నిల్వల్లో పుట్టి పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంతోష్, నల్లూరి సూర్యనారాయణ, కనకరాజు, అప్పారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.
- 85వ వార్డు కొండయ్యవలస, అట్టవానిపాలెం గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో వార్డు నాయకులు ఇల్లపు ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.సీతారామ్, బలిరెడ్డి సత్యనారాయణ, బండారు చందు, మోటూరి వెంకటరమణ పాల్గొన్నారు.

సందడిగా వన మహోత్సవం



నడుపూరు పాఠశాలలో మొక్క నాటుతున్న కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, ఉపాధ్యాయులు

పెదగంట్యాడ: పాఠశాలలో పెద్ద ఎత్తున మొక్కలు నాటి నందన వనంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనీయులని 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీభాయి అన్నారు. వన మహోత్సవంలో భాగంగా నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ పాఠశాలలో ఔషధ గుణాలు ఉన్న మొక్కలు నాటడం అభినందనీయమన్నారు. పాఠశాల హెచ్‌ఎం రాచకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ వనంలో సీతాఫలం, రామఫలం, లక్ష్మణ్ ఫలం, హనుమాన్ ఫలం, సీతాఅశోక, పుత్రరం జీవ, రుద్రాక్ష మొక్కలు నాటామన్నారు. కార్యక్రమంలో పలకా శ్రీదేవి, ఉమా, కృష్ణ కుమారి, జీవన జ్యోతి, సుగుణ, సుబ్బలక్ష్మి, షర్మిల తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్‌లో..

అగనంపూడి: పరిసరాల్లో పచ్చదనం పెంపొందించడం కోసం ప్రతీ విద్యార్థి మొక్కలు నాటాలని దువ్వాడ విజ్ఞాన్ ఫార్మా కళాశాల ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు అన్నారు. వన మహోత్సవం కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. రెండు నెలల్లో కళాశాల ఆవరణలో వెయ్యి మొక్కలు నాటాలని సంకల్పించామన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో సత్యలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

1న నిర్వాసిత కాలనీల్లో ధర్నాలు



మాట్లాడుతున్న అయోధ్యరామ్

అగనంపూడి: విశాఖ ఉక్కును పరిరక్షించుకోడానికి పోరాటాలే శరణ్యమని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకుడు జె.అయోధ్యరామ్ అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెం కూడలిలో 1296 రోజుల నుంచి రిలే దీక్షా శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేనెల 1వ తేదీన అగనంపూడి కూడలి, వడ్లపూడి సచివాలయ కూడలి, పెదగంట్యాడ జంక్షన్లలో ఉదయం 9 నుంచి ఒంటి గంట వరకు ధర్నాలు చేపట్టనున్నామన్నారు. సీనియర్ నాయకులు ఎన్.రామారావు మాట్లాడుతూ 1300 రోజులుగా ఆందోళనలు చేస్తుంటే ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో నాయకులు యు.రామస్వామి, బి.అప్పారావు, గంగాధర్, టీవీకేరాజు, పుల్లారావు, మురళీ, సత్యనారాయణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శనివారం పదవీ విరమణ పొందనున్న సీహెచ్ సన్యాసిరావును సత్కరించారు.

నైట్ అవుట్ అలవెన్స్ చెల్లించాలి

ఉక్కునగరం: నైట్ అవుట్ అలవెన్స్‌లు చెల్లించకపోతే ఉద్యమం చేస్తామని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ జోనల్ సెక్రటరీ బి.కె.మూర్తి హెచ్చరించారు. శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డ్రైవర్, కండక్టర్లకు హెడ్ క్వార్టర్స్ విడిచి బయట ప్రదేశాల్లో ఉద్యోగం చేసే సమయంలో ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చే టీఏ, డైలీ అలవెన్స్ నిలిపి వేయడం దారుణమన్నారు. వాటిని చెల్లించకపోతే పోరాటం చేస్తామన్నారు. జోనల్ అధ్యక్షులు కె.జె. ప్రభాకర్, వై. రాము, జి. తాతలు, నారాయణ, పి. పద్మపాల్గొన్నారు.